సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం ၊ 11 ၊ ఏప్రిల్ ၊ 2023



వైఎస్సార్‌సీపీ నాయకుడి హత్య కేసులో 8 మంది అరెస్ట్

కమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కె. జయ శంకర్‌రెడ్డి హత్య కేసులో 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



వందేళ్ల సబ్‌కలెక్టరేట్..

వైఎస్సార్ జిల్లాలో ఉన్నప్పుడు కలెక్టరేట్ తర్వాత సబ్‌కలెక్టరేట్ స్థానం రాజంపేటది. ప్రస్తుతం ఇది వందేళ్లు పూర్తి చేసుకుంది. చరిత్రాత్మక కట్టడంగా మిగిలిపోయింది.. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.104
రెండోరకం	రూ.50	రూ.82

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 202 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	449	575
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 248.18 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
రాజంపేట	6.33	4.46
రాయచోటి	6.32	4.45
మదనపల్లి	6.34	4.48
పీలేరు	6.30	4.38

న్యూస్‌రీల్

నేడు జిల్లా నిఘా పర్యవేక్షణ కమిటీ సమావేశం

రాయచోటి : కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 11న మంగళవారం సాయంత్రం 4 గంటలకు 2023–24 సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించి జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. జిల్లాలోని నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో పూలే జయంతి వేడుకలు

రాయచోటి : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మంగళవారం కలెక్టరేట్‌లో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఉదయం 10 గంటలకు ఈ వేడుకలను నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘం నాయకులు, జిల్లా అధికారులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

14 నుంచి ప్రచార భేరి

మదనపల్లె సిటీ : కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా 14 నుంచి రాజకీయ ప్రచారభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, నరసింహులు తెలిపారు. సోమవారం వారు స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా పాదయాత్రలు, జీపు యాత్రలు, సభలు నిర్వహించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటామన్నారు. పార్లమెంటులో ప్రజాస్వామ్య జ గొంతునొక్కి, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తున్నారన్నారు. గ్యాస్,పెట్రోల్, విద్యుత్ చార్జీలు, ఆస్తి, చెత్తపన్నుల భారాలు ప్రజలపై మోపారన్నారు. ప్రజాస్వామ్యవాదులు, అన్యాయాన్ని ప్రశ్నించేవారందరూ ఉమ్మడిగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. సీపీఎం, సీపీఐ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ

రాయచోటిటౌన్ : విదేశాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వెళ్లాలనుకునే మహిళలకు హౌస్ కీపింగ్, కుకింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో హౌస్‌కీపింగ్, కుకింగ్ అంశాలలో శిక్షణ ఇస్తారన్నారు. విదేశాలలో మతపరమైన సంస్కృతి, సంప్రదాయాలు, విదేశాలలోని చట్టాలపై శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు ప్రసాద్ 9676736623, సుజాత 9177143181 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



కవర్లు కట్టిన మామిడి చెట్టు (ఇన్‌సెట్) మామిడి కాయలకు కవర్లు కడుతున్న రైతు



ప్రకృతి ఒడిలో..
పంట భద్రుడు.!

అతను బీటెక్ డిగ్రీ పట్టా పొందాడు. కొన్నేళ్ల పాటు పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగం చేశాడు. కొలువు కోసం ఊరు గాని ఊరుకు వెళ్లి తన శక్తిసామర్థ్యాలు వినియోగించే బదులు.. సొంత ఊరిలోనే పుడమి తల్లిని నమ్ముకుని బతకడంలో ఉన్న ఆనందమే వేరనుకున్నాడు.. అంతే.. తన కొలువుకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయంతో దోస్తీ చేశాడు. మధుర ఫలాల సాగులో మంచి ఫలితాలను పొందుతూ దూసుకెళ్తున్నాడు ఈ నిత్యకృషీవలుడు.

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు
- నాణ్యమైన మామిడి దిగుబడి లక్ష్యంగా అడుగులు
- సహజసిద్ధమైన రంగు, రుచి, వాసనతో మామిడి ఫలాలు
- నంబర్ వన్ క్వాలిటీతో విదేశాలకు ఎగుమతి

పీలేరు : కేవీపల్లె మండలం నూతనకాల్వ గ్రామానికి చెందిన శివకుమార్ బీటెక్ చదివాడు. గతంలో సాఫ్ట్‌వేర్ రంగంలో బెంగళూరు తదితర ప్రదేశాల్లో ఉద్యోగం చేసేవాడు. తిరుపతిలో కొన్నేళ్లుగా ఉద్యోగం చేస్తున్న ఆయనకు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ కల్గింది. ప్రజలకు సహజసిద్ధమైన పంట ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో తనకున్న 15 ఎకరాల మామిడి తోటను కొత్తపద్ధతిలో అభివృద్ధి చేసేందుకు సంకల్పించాడు. పట్టభద్రుడు కాస్తా 'పంట'భద్రుడిగా మారాడు. 2019లో ప్రకృతి వ్యవసాయ నిపుణుడైన బోదేషావలి సూచనలు, సలహాలు తీసుకుని అప్పటి నుంచి తన మామిడి తోటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు ప్రారంభించాడు. ప్రతి ఏటా మామిడి చెట్లకు పిచికారీ రూపంలో జీవ పురుగు మందులను, జీవ శిలీంద్రాలను అందిస్తూ వస్తున్నాడు.

నాణ్యమైన దిగుడే లక్ష్యం

పండ్లలో రారాజు అయిన మామిడి సాగులో నాణ్యమైన పంట దిగుబడే లక్ష్యంగా రైతు శివకుమర్ వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టాడు. ప్రధానంగా సహజ సిద్ధమైన రంగు, రుచి, వాసనతో మామిడి పండ్ల దిగుబడే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంట సాగు చేస్తున్నాడు. జిల్లా వ్యవసాయ సలహామండల సభ్యుడు బోదేషావలి పర్యవేక్షణలో మామిడి సాగు చేస్తూ నంబర్ వన్ క్వాలిటీతో విదేశాలకు ఎగుమతి చేయడానికి సిద్ధం చేస్తున్నాడు.

సేంద్రియ ఎరువులతో సాగు..

గత నాలుగేళ్లుగా మామిడి తోటకు ప్రకృతి వ్యవసాయ వైద్య నిపుణుడు బోదేషావలి సొంతంగా తయారు చేసి అందజేసిన అనిమిల్ (స్థూల, సూక్ష్మ పోషకాలు కల్గిన) ద్రావణాన్ని మాత్రమే వాడుతూ వచ్చాడు. చెట్టుకు వేరు ద్వారా అందాల్సిన పోషకాలను ఒక ఎకరానికి 10 కిలోల జనుము, 10 కిలోల నవధాన్యాలను చల్లి పూత దశలో భూమిలోకి కలియదున్నడం చేశాడు.

మామిడికి కవర్లు...

ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకోవడానికి మామిడికి కవర్లు కట్టే పద్ధతి తీసుకొచ్చాడు. శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖాధికారుల సూచనలు, సలహాల మేరకు ప్రతి ఏటా మామిడి కాయలకు కవర్లు కడుతున్నాడు. ఒక్కో మామిడి కాయకు కవరుతో కలిపి కట్టేందుకు రూ. 2.50 ఖర్చు అవుతున్నట్లు రైతు తెలిపాడు.

విదేశాల్లో మంచి గిరాకీ...

ప్రకృతి వ్యవసాయ పద్ధతితో పాటు కవర్లు కట్టిన మామిడి కాయలు అత్యంత నాణ్యత కలిగి ఉంటాయి. దీంతో మన దేశంతోపాటు విదేశాల్లోనూ ఈ కాయలకు మంచి గిరాకీ లభిస్తోంది. రైతు శివకుమార్ పండించే నంబర్ వన్ క్వాలిటీ కల్గిన మామిడి కాయలను ప్రతి ఏటా అమెరికా, కువైట్, దుబాయ్ లాంటి దేశాలకు ఎగుమతి చేస్తూ అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు.

కవర్లతో ప్రయోజనాలు...

- కవర్లు వాడటం వలన పండు ఈగ ప్రభావాన్ని నివారించవచ్చు.
- తామర పురుగు, పిండినల్లి, పేనుబంక, తెల్లదోమ వలన కలిగే నష్టాన్ని నివారించవచ్చు.
- టెంక పురుగు వలన కలిగే నష్టాన్ని నియంత్రించవచ్చు.
- ఏప్రిల్, మే మాసాలలో సంభవించే అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మామిడి కాయలు రాలకుండా చేయవచ్చు.
- మామిడి కాయ రంగు, రుచి, వాసన సహజ సిద్ధంగా ఉండే విధంగా పంటను పండించవచ్చు.
- కవర్లు కట్టిన మామిడి కాయలు మార్కెట్‌లో అధిక ధర పలుకుతాయి.

కవర్లతో చీడపీడల నుంచి రక్షణ



మామిడి కాయలకు కవర్లు కట్టడం ద్వారా నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. కాయలకు చీడపీడల నుంచి రక్షణ కవచంలా కవర్లు పని చేస్తాయి. కాయలపై మచ్చలు, గీతలు పడకుండా మంచి నాణ్యతతో ఆకర్షణీయంగా ఉంటాయి. రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. – రవిచంద్ర, జిల్లా ఉద్యానశాఖ అధికారి

ప్రకృతి వ్యవసాయంలో బహుళ ప్రయోజనాలు



మామిడి సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. నాణ్యమైన మామిడి పండ్లను పండించవచ్చు. ఆసక్తిగల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తాం. – బోదేషావలి, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, జిల్లా, వ్యవసాయ సలహామండలి సభ్యుడు.

నాణ్యమైన పండ్ల దిగుబడే లక్ష్యంగా...



మామిడిలో నాణ్యమైన పండ్ల దిగుబడే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నా. బేనీషా, మల్‌గూబ, మల్లిక, ఖాదర్ రకాల పండ్లకు కవర్లు కట్టి కాపాడుతున్నా. విదేశాలకు ఎగుమతి చేయడం కొన్నేళ్లుగా చేస్తున్నాను. – శివకుమార్, రైతు, నూతనకాల్వ

నేడు జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ



పూలే విగ్రహావిష్కరణ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో మంగళవారం మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శతాబ్దాల క్రితమే దేశంలో కులవ్యవస్థ నిర్మూలన కోసం పోరాడి బడుగు, బలహీనుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన పోరాట యోధుడు పూలే అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి జయరామ్, ఎమ్మెల్సీ ఏసురత్నం, ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్ కుమార్‌యాదవ్, కడప మేయర్ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, చిట్వేలి, కోడూరు మండలాల కన్వీనర్లు చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రాజు, వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, సిహెచ్.రమేష్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంలో ప్రగతి సాధించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రభుత్వ పథకాల లక్ష్యాలను వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, మండల డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, వాటి లక్ష్య సాధనపై మండల అధికారులు, ఆర్డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రీ సర్వేలో భాగంగా లక్ష్యం మేరకు హద్దురాళ్లు పాతడంలో తహసీల్దార్లు కచ్చితంగా ప్రగతి సాధించాలన్నారు. రోజువారి లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉందన్నారు. రాయచోటి, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, లక్కిరెడ్డిపల్లి మండలాలు ప్రగతిలో వెనుకబడి ఉన్నాయని, వచ్చే వారంలోగా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. గృహ నిర్మాణ అంశంలో భాగంగా కూలీలకు పనులు కల్పించాలని చెప్పారు. ఎస్‌డీజీ లక్ష్యంలో భాగంగా గ్రామ సచివాలయాలు, ఐసీడీఎస్ శాఖలు సమన్వయంతో పనిచేసి 0–5 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ అప్డేషన్ చేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, రాయచోటి, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు వివిధ శాఖల, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ వారితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచేలా అర్జీల పరిష్కారం

ప్రజల్లో సంతృప్తిని పెంచేలా స్పందన అర్జీల పరిష్కారం చూపాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి విజ్ఞప్తులను కలెక్టర్ స్వీకరించారు. అర్జీల స్వీకరణలో డీఆర్‌ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల, విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉండకూడదన్నారు.

ఈవీఎంల నిల్వ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

రాయచోటి, మాసాపేటలోని మార్కెట్ యార్డులో ఈవీఎంలు నిల్వ ఉంచడానికి గోదాములను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పరిశీలించారు. సోమవారం సాయంత్రం ఆర్డీఓ రంగస్వామి, తహసీల్దార్ ప్రేమంత్ కుమార్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. అందులో భాగంగా అక్కడ నాలుగు గోదాములను పరిశీలించి ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

రాయచోటి అర్బన్ : తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని ఏపీజేఏసీ జిల్లా నేతలు స్పందన కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీలకు విన్నవించారు. జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహకుమార్, మల్లికార్జున, ఉపాధ్యక్షుడు డీఎస్‌బి రెడ్డిలతో పాటు పలువురు ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నల్లరంగు మాస్కులు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కలెక్టర్‌ను అలాగే ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

చిరు ధాన్యాల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ



చిరుధాన్యాల అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : చిరుధాన్యాల వినియోగం పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, అగ్రికల్చర్, కేవీకే తదితర అనుబంధ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023 చిరుధాన్యాల మహోత్సవం అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అండుకొర్రలు, అరికెలు, వరిగలు, సామలు తదితర ఉత్పత్తుల స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శించి, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మిగతా జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లా చిరుధాన్యాల సాగులో ముందడుగు వేసేందుకు చాలా అవకాశాలున్నాయన్నారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అగ్రికల్చర్ జేడీని కలెక్టర్ ఆదేశించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, కృషి విజ్ఞాన కేంద్రం, ఇతర శాఖల జిల్లా అధికారులు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15న మెగా జాబ్ మేళా

రాయచోటి : రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ స్పందన హాలులో మెగా జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెగా జాబ్‌మేళాలో 80 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యం.. భక్తిమయం



రంజాన్ మాసం ముస్లింలకు పరమ పవిత్ర మాసం. ఇస్లాం కాలమానంలోని 9వ నెల రంజాన్. ఈ మాసంలో ముస్లింలు 30 రోజుల పాటు ఎంతో నిష్టతో ఉపవాసదీక్షలు చేపడతారు. ఇందులో భాగంగా వేకువ జామున 4 గంటల సమయంలో అల్పాహారాన్ని స్వీకరిస్తారు. దీనిని 'సహరీ'అంటారు. అప్పటి నుంచి సాయంత్రం 6.30 వరకు ఎలాంటి ఆహార పానీయాలు సేవించకుండా ఉపవాసదీక్షను చేపడతారు. సాయంత్రం 6.30 గంటలకు ఖర్జూరంతో ఉపవాసదీక్షలు విరమిస్తారు. దీనిని ఇఫ్తార్ అంటారు. పెద్దలపై మాత్రమే ఉపవాసదీక్షలు విధిగా ఉండాలన్న నిబంధన ఉంది. మదనపల్లె పట్టణంలో 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలలోపు చిన్నారులు కూడా ఉపవాసదీక్షను చేపడుతున్నారు. వారిని చూసిన ప్రతి ఒక్కరూ వారి దైవభక్తిని మెచ్చుకొని అభినందిస్తున్నారు. – మదనపల్లె సిటీ



రోజా ఉంటే పుణ్యమట

రంజాన్ నెలలో ఉపవాసం ఉంటే పుణ్యం అధికంగా వస్తుందని మా నాన్నమ్మ చెబుతోంది. ప్రతి సంవత్సరం రోజాలు ఉంటాను. నేను కూడా ఈసారి నెల ఉపవాసాలు ఉంటున్నా. – మహమ్మద్ ముస్తఫా

కుటుంబ సభ్యులతో కలిసి..

రంజాన్ నెల వచ్చిందంటే మా కుటుంబ సభ్యులందరూ ఉపవాసాలు ఉంటారు. వారితో పాటు నేను కూడా మూడేళ్ల నుంచి దీక్షలు పాటిస్తున్నా. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఏం తీసుకోను. – సారా అంజుం





ఆకలి దప్పికలు గుర్తుకు రావు

రోజా ఉండటం గత ఏడాది నుంచి అలవాటు చేసుకున్నా. అల్లాపై భరోసాతో దీక్షలు చేస్తున్నప్పుడు ఆకలి, దప్పికలు గుర్తుకు రావు. ఈ ఏడాది కూడా అన్ని రోజాలు ఉండాలనుకుంటున్నాను. – ఉమర్ షారూఖ్

నాకు ఇష్టమైన మాసం

రంజాన్ అంటే నాకు ఎంతో ఇష్టం. ఐదుపూటలా నమాజ్‌తో పాటు ఉపవాసాలు ఉంటాను. మంచి చెడు గురించి తెలుసుకుంటాను.ఆధ్యాత్మికంగా గడుపుతా. – హాదియా రెహ్మాన్



సెగ.. భగభగ!



- జిల్లాను అదరగొడుతున్న ఎండలు
- మధ్యాహ్నమైతే బయటికి రావాలంటే భయపడుతున్న జనం
- బోసిపోతున్న ప్రధాన రహదారులు

జిల్లాలో గత ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం
05.04.2023	39.0	26.0
06.04.2023	39.0	26.0
07.04.2023	39.0	25.0
08.04.2023	37.0	24.0
09.04.2023	38.0	24.0
10.04.2023	38.0	21.0

సాక్షి రాయచోటి : భానుడి భగభగలు పెరిగిపోతున్నాయి. ప్రతిరోజు ఉదయం నుంచే వేడి ప్రభావం ఉంటుండడంతో జనం అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ నెల ప్రారంభం నుంచే ఎండలు అదరగొడుతున్నాయి. రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. అలాంటి పరిస్థితులు నేడు ఉత్పన్నమవుతున్నాయి. మే నెలలో ఎండలు మరింత తీవ్రతరం కానున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. గతంలో ప్రతిసారి వేడిగాలులు, వడదెబ్బ ధాటికి అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. గత నాలుగైదు రోజులుగా వేడిగాలులు పెరగడంతో వాతావరణ శాస్త్రవేత్తలు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రతిరోజు ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

వేడిగాలులకు తోడు అధిక ఉష్ణోగ్రతలు

జిల్లాలో సూర్యభగవానుడికి తోడు వేడిగాలులు ప్రజలను భయపెడుతున్నాయి. ప్రధానంగా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉక్కపోత ఉండడంతో చెట్ల కింద సేద తీరుతున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేడిగాలులతో వడదెబ్బ సోకే ప్రమాదం ఉండడంతో వీలైనంత మేర ప్రజలు ఎండల్లో తిరగవద్దని వైద్యులు సూచిస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు కూడా జాగ్రత్తలు పాటించాలని తెలియజేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎక్కడికక్కడ ఫుట్‌పాత్‌లపైన, దుకాణాల వద్ద గొడుగులు, కళ్లద్దాలు, టోపీలను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. అలాగే పలు పనులపై బయటికి వచ్చిన వారు ఎండావేడిమికి తాళలేక కొబ్బరినీరు, చల్లని పానీయాలు తీసుకుంటూ పనులు త్వరగా ముగించుకుని ఇంటిదారి పడుతున్నారు.



బోసిపోయిన కడప-రాయచోటి జాతీయ రహదారి

ఇంటికే పరిమితం..

ఎండా వేడిమి అధికంగా ఉండడంతో జనాలు ఎక్కువగా ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ప్రధానంగా మధ్యాహ్న సమయంలో అయితే ప్రధాన రహదారులతోపాటు రద్దీ కూడళ్లు బోసిపోతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనాలు కనిపించడం లేదు. ఉద్యోగులు కూడా కార్యాలయాలకే క్యారీలు తీసుకు వెళుతున్నారు. అత్యవసరమైన పనులు ఉంటే తప్ప జనాలు బయటికి రావడం లేదు. కేవలం ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే వాహనదారులు బయట కనిపిస్తున్నారు. ఏది ఏమైనా వేసవి నేపథ్యంలో వేడి ప్రభావానికి జనం విలవిల్లాడిపోతున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో స్టేట్‌బ్యాంక్ వద్ద సోమవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఆయన నల్లచారల చొక్కా, నలుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

మైదుకూరు : పట్టణంలో ఓపెన్ ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చి ఓ విద్యార్థిని కనిపించకుండా పోయిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర సోమవారం తెలిపారు. వివరాలు.. చక్రాయపేట మండలం సురభి గ్రామానికి చెందిన విద్యార్థిని ఈ నెల మూడో తేదీన ఓపెన్ ఇంటర్ పరీక్ష రాసేందుకు మైదుకూరులోని ఓ పరీక్ష కేంద్రానికి వచ్చింది. పరీక్ష అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికారు. సోమవారం బాలిక తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు

కడప అర్బన్ : చెక్‌బౌన్స్ కేసులో కుండా మహేశ్వర అనే వ్యక్తికి ఏడాదిపాటు జైలు శిక్ష, చెక్ మొత్తం రూ.9.47 లక్షలు చెల్లించాలని రెండవ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ సోమవారం తీర్పునిచ్చారు. శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, కడప వారి తరఫున న్యాయవాది పి.భరణీకుమార్ నాయుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చక్రాయపేటకు చెందిన కుండా మహేశ్వర అనే వ్యక్తి కడప శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్‌లో 2018లో రూ.25 లక్షల రుణం తీసుకున్నాడు. 60 కంతులలో రుణం మొత్తం చెల్లించాల్సి వుండగా, కొంత చెల్లించాడు. కంపెనీ వారి డిమాండ్ మేరకు రూ.9.47 లక్షలకు అలహాబాద్ బ్యాంకులో చెల్లుబాటు అయ్యే విధంగా 2019 నవంబర్ 18న చెక్కు ఇచ్చాడు. కంపెనీ వారు ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. కావున సంస్థ వారు కోర్టులో కేసు దాఖలు చేశారు. కోర్టు వారు కేసు పూర్వాపరాలు విచారణ చేసిన తరువాత కుండా మహేశ్వర నేరం చేసినట్లుగా తేలింది. నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్షతోపాటు చెక్ మొత్తం చెల్లించాలని కడప రెండవ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ తీర్పు ఇచ్చారు. చెక్కు మొత్తం కట్టని పక్షంలో అదనంగా మూడు నెలల పాటు సాధారణ జైలు శిక్షను అనుభవించాలని ఆయన చెప్పారు.

వందేళ్ల.. సబ్‌కలెక్టరేట్

- శతాబ్ది ఉత్సవాలకు నోచుకునేనా..!
- బ్రిటీష్ కాలం నుంచి ఐఏఎస్‌ల రాజ్యం
- జిల్లా కేంద్రంతో సమానంగా..
- వైఎస్సార్‌సీపీ హయాంలో మళ్లీ ఐఏఎస్‌ల పాలన

సబ్‌కలెక్టరేట్	రాజంపేట
కేంద్రం	పార్లమెంటు నియోజకవర్గం
ప్రారంభం	1915
ఐఏఎస్‌లు	23 మంది



రాజంపేట సబ్ కలెక్టరేట్ ముఖద్వారం

రాజంపేట సబ్‌కలెక్టరేట్				
నియోజకవర్గం	మండలాలు	గ్రామాలు	విస్తీర్ణం (చ.కి.మీ)	జనాభా
రాజంపేట	6	103	1784	3,06,995
రైల్వేకోడూరు	5	101	1360	2,67,987

రాజంపేట : వైఎస్సార్ జిల్లాలో ఉన్నప్పుడు కలెక్టరేట్ తర్వాత సబ్‌కలెక్టరేట్ స్థానం రాజంపేటది. ఇప్పుడు అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రంతో సమానంగా ఐఏఎస్‌ల పాలన రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కొనసాగుతోంది. 1915లో 13 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన స్థలంలో సబ్ కలెక్టరేట్ ఏర్పాటు అయింది. రాజంపేట, రైల్వేకోడూరు ఉమ్మడి నియోజకవర్గానికి సబ్‌కలెక్టరేట్ ప్రజాస్వామ్యపరంగా ప్రత్యేక భూమిక పోషించింది. ఇప్పుడు ఈ సబ్‌కలెక్టరేట్ వందేళ్లు పూర్తి చేసుకుంది. తెల్లదొరలపాలన నుంచి రెవెన్యూ సేవలందించిన రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఒక చారిత్రాత్మక కట్టడంగా మిగిలిపోయింది.

బ్రిటీష్ కాలం నుంచి..

బ్రిటీష్ కాలం నుంచి డివిజన్‌కు చరిత్ర ఉంది. ఎందరో ఐఏఎస్‌లు ఇక్కడ సబ్‌కలెక్టరుగా పని చేశారు. సీనియర్ ఐఏఎస్‌లు ఎంఎస్ రాజాజీ, సతీనాయర్, డి.ఆరోరా, సి.రామచంద్రమూర్తి, టీఎస్ రంగాచారి, వల్లియప్పన్, ఎంఆర్‌సాయ్, మిన్నిమాథ్యుస్, జానకికృష్ణమూర్తి, ఏకే గోయల్, సతీసుజామన్, రణబీర్‌సుధన్, అజయ్‌జైన్ లాంటి వారు రాజంపేట సబ్‌కలెక్టరుగా పని చేసి రెవెన్యూశాఖ పేరు ఇనుమడింపచేశారు. ల్యాండ్ రెవెన్యూ కమిషనరుగా పని చేసిన పునీత ఇక్కడ సబ్‌కలెక్టరుగా పని చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీగా మిన్నీమాథ్యూస్ పని చేశారు. ప్రీతీమీనా సబ్‌కలెక్టర్‌గా పని చేశారు.

సభభావనం చరిత్ర ఇలా..

1977లో దళిత, గిరిజన డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ప్రైమరీ సొసైటీ లిమిటెడ్ కార్యాలయం ఉండేది. ఈ కార్యాలయాన్ని ఐఏఎస్ అధికారి కుమారి జానకి కృష్ణమూర్తి సబ్‌కలెక్టరుగా ఉన్నప్పుడు ప్రారంభించారు. 20 ఏళ్ల తర్వాత రెవెన్యూ డివిజన్‌కు మీటింగ్ హాల్‌గా మార్చివేశారు. 1998 ఏప్రిల్ 30న అప్పటి జిల్లా కలెక్టరు నాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఆర్డీవో సభాభవనం అందుబాటులోకి వచ్చింది. 17 ఏళ్లు పూర్తి కావస్తోంది.

డివిజన్ స్వరూపం ఇలా..

రాజంపేట సబ్ కలెక్టరేట్‌గా చరిత్ర కలిగిన రాజంపేట సబ్‌కలెక్టరేట్ జిల్లాలో సగంభాగం రెవెన్యూ పాలన ఇక్కడి నుంచే జరిగేది. డివిజన్లు ఏర్పాటు తర్వాత రాయచోటి కడప డివిజన్‌కు, జమ్మలమడుగులో ఉన్న బద్వేలు రాజంపేట డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చారు. పరిధిలో డివిజన్‌గా రూపాంతరం చెందిన తర్వాత 17 మండలాలుగా విస్తరించబడింది. సబ్‌కలెక్టరేట్‌లో ఐఏఎస్‌లు సబ్ కలెక్టరుగా పిలవబడుతూ వచ్చారు. డివిజన్ల అయిన తర్వాత ఆర్డీవోలుగా కొంత మంది పని చేశారు. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతవరణంలో రాజంపేట సబ్‌కలెక్టరేట్ కనిపిస్తోంది. అలాగే ఆర్డీఓ క్యాంప్ ఆఫీసు, క్వార్టర్స్‌తోపాటు రెవెన్యూ హోం, జడ్జి క్వార్టర్స్, సభాభవనం లాంటి భవనాలు ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీలో మళ్లీ ఐఏఎస్‌ల పాలన

వైఎస్సార్‌సీపీ పాలనలో మళ్లీ ఐఏఎస్‌ల పాలనకు శ్రీకారం చుట్టారు. కేతన్‌గార్గ్ సబ్‌కలెక్టర్‌గా పని చేశారు. ఆయన అనంతపురం జేసీగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం సబ్‌కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పని చేస్తున్నారు. .2012–2014 వరకు ఐఏఎస్ హోదాలో రాజంపేట సబ్‌కలెక్టరుగా ప్రీతిమీనా రెవెన్యూ సేవలను డివిజన్‌లో కొనసాగించారు.

శతాబ్ది ఉత్సవాల కోసం ఎదురుచూపు

వందేళ్లు పూర్తి అయి రెండేళ్లు అవుతున్న భావితరాలకు రాజంపేట సబ్‌కలెక్టరేట్ చరిత్రను చాటి చెప్పే విధంగా చేయాల్సిన శతాబ్ది ఉత్సవాలకు ఇప్పుడైనా నోచుకుంటుందా అని రాజంపేట వాసులు ఎదురు చూస్తున్నారు. ఆ దిశగా జిల్లా రెవెన్యూ శాఖ దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాజంపేట సబ్‌కలెక్టరేట్ చరిత్రను ఎలుగెత్తి చాటి చెప్పేలా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు రెవెన్యూ అసోసియేషన్‌తోపాటు రెవెన్యూ పెద్దలు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. కాగా ఆర్డీవోగా వీరబ్రహ్మం పని చేసిన క్రమంలో సబ్‌కలెక్టరేట్‌లో లభించిన 1915 నాటి శిలాఫలకం జీర్ణోద్ధరణ చేసిన సంగతి తెలిసిందే.

తలమానికం



ఉభయవైఎస్సార్ జిల్లాలో రెవెన్యూ వ్యవస్థకే రాజంపేట సబ్‌కలెక్టరేట్ తలమానికం. బ్రిటిషుకాలం నుంచి రెవెన్యూ వ్యవస్థకే పెద్ద చారిత్రాత్మక కలెక్టరేట్‌గా భావిస్తున్నాను. నాటి రెవెన్యూ పాలనను అద్దంపట్టే కేంద్రంగా రాజంపేట సబ్‌కలెక్టరేట్ విరాజిల్లింది. భావితరాలకు చాటి చెప్పేలా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

-పి.నరసింహకుమార్, అధ్యక్షుడు, రెవెన్యూ అసోసియేషన్, అన్నమయ్య జిల్లా

తెల్లదొరల కాలం నుంచే..



తెల్లదొరల పాలన నాటి రెవెన్యూ వ్యవస్థ ఈ సబ్ కలెక్టరేట్‌లో కొనసాగింది. రాజంపేట సబ్‌కలెక్టరేట్‌కు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. వందేళ్ల పూర్తి చేసుకుంది. భావితరాలకు రాజంపేట సబ్‌కలెక్టరేట్ చరిత్రాత్మకను తెలియజేయాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉంది. శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై రెవెన్యూ పెద్దల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాం.

-బి.శ్రీధర్‌రావు, అధ్యక్షుడు, రాజంపేట డివిజన్, రెవెన్యూ అసోసియేషన్

వైఎస్సార్‌సీపీ నాయకుడి హత్య కేసులో 8 మంది అరెస్ట్



మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ బీవీ శివారెడ్డి

కమలాపురం : కమలాపురం పట్టణం తెలుగు వీధికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కె. జయ శంకర్‌రెడ్డి హత్య కేసులో 8 మందిని అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ బీవీ శివారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శంకర్ రెడ్డి కుమారుడు పవన్ కల్యాణ్‌రెడ్డి, గిడ్డంగివీధికి చెందిన పల్లె శేఖర్ రెడ్డి కుమార్తెను ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం శేఖర్‌రెడ్డి సోదరుడైన టీడీపీ నాయకుడు పల్లె రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు రుచించలేదు. శంకర్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే తన కుమారుడిని ప్రోత్సహించడంతో పాటు తమను అవమాన పరిచాడని భావించిన పల్లె రామసుబ్బారెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి కసి పెంచుకున్నారు. శంకర్ రెడ్డిని హత్య చేయాలని పథకం వేశారు. ఈ నేపథ్యంలో 7వ తేదీ మధ్యాహ్నం మూలగడ్డ సమీపంలోని తన పొలంలో సాగు చేసిన కొర్రపంటకు నీరు పారగట్టడానికి కొడుకుతో పాటు వెళ్లిన శంకర్ రెడ్డిపై నిందితులు కాపు కాచి ఇనుపరాడ్లతో దాడి చేసి హత్య చేశారు. మృతుడి రెండో కుమారుడు నవీన్ కల్యాణ్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో పల్లె రామసుబ్బారెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, పల్లె రవీంద్రారెడ్డి (నరేంద్రారెడ్డి), కర్రెడ్ల మహేష్, పల్లె వెంకట సుబ్బారెడ్డి, పుత్తా శ్రీనివాసులరెడ్డి, మండ్ల శ్రీనివాసులు, యాకాసి వెంకట రమణల ప్రమేయం హత్యలో ఉన్నట్లు విచారణలో తెలిసిందన్నారు. వీరంతా సోమవారం సంబటూరు సమీపంలో ఉండగా అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన 6 ఇనుప రాడ్లు, రెండు బైక్స్, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ హత్య కేసులో ఇతరుల పాత్ర ఏమైనా ఉందా అని తేల్చడం కోసం లోతైన దర్యాప్తు చేపడుతున్నట్లు బీవీ శివారెడ్డి తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐ సత్యబాబు, ఎస్ఐ చిన్నపెద్దయ్య పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయించండి



నాగార్జునరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : నియోజకవర్గంలోని ప్రజలు, రైతులకు మరింత మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు మరికొన్ని సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి.. ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి సీవీ నాగార్జునరెడ్డిని కోరారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన సోమవారం రాజంపేటకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వంకన గురుప్రతాప్‌కుమార్‌రెడ్డి తన స్వగృహంలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డిని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ సత్కరించారు. ఆయన వారితో నియోజకవర్గంలోని అభివృద్ధిపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఓఎస్‌డీ శ్రీనివాసులు, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ సురేంద్రనాథ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు భూమన శివశంకర్ రెడ్డి, వివిధ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

వల్లూరు : మండల పరిధిలోని గోటూరుకు చెందిన పల్లావుల పెద్ద సుబ్బరాయుడు అనే వ్యక్తి పై అతడి తమ్ముడు పల్లావుల లక్ష్మయ్య, తమ్ముని కుమారుడు లక్ష్మణరావు దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నదమ్ములైన పెద్ద సుబ్బరాయుడు, లక్ష్మయ్యకు భూ తగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం పెద్ద సుబ్బరాయుడు గోటూరు గ్రామ శివారులో వాకింగ్‌కు వెళ్లగా.. అక్కడ లక్ష్మయ్య, అతని కుమారుడు లక్ష్మణరావు కలసి దాడి చేసి గాయపరిచారు. అక్కడ ఉన్న ప్రజలు గట్టిగా కేకలు వేయడంతో తండ్రి కొడుకులిద్దరూ పరారయ్యారు. బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడపకు తరలించారు. పెద్ద సుబ్బరాయుడు మేనల్లుడు సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చౌక బియ్యం పట్టివేత

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని రైస్ మిల్లులో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 694 చౌక బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఎం.ఎ.రమేష్ సోమవారం తెలిపారు. సుమారు రూ.13లక్షల విలువ గల చౌక బియ్యం పట్టుకు ని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

మదనపల్లి : అప్పుల బాధతో మనస్తాపం చెందిన ఓ చేనేత కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. మొలకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన బి.ఎస్.ఆనందరెడ్డి (35) కొంత కాలం క్రితం పట్టణంలోని ఆయోధ్యనగర్‌కు వచ్చి స్థిరపడ్డాడు. చేనేత కార్మికునిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య సుభాషిణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో ఆనందరెడ్డితో పాటు భార్య సుభాషిణి కూడా చేనేత పనులు చేస్తుండేది. కొద్ది రోజులుగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. చేనేత పనులు సక్రమంగా జరగపోవడంతో కుటుంబ పోషణకై ఆనందరెడ్డి పలుచోట్ల అప్పులు చేశాడు. చేసిన అప్పులు సకాలంలో తీర్చలేకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది. వేధింపులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన ఆదివారం రాత్రి ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి బాధితునికి ఉరితాడు తొలగించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అయోధ్యనగర్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. జరిగిన ఘటనపై స్థానికులను ఆరా తీశారు. భార్య సుభాషిణిని విచారణ చేయగా తన భర్త అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపింది. రూ.4 లక్షల వరకు అప్పులు చేశామని వివరించింది. ఈ ఘటనతో బాధిత కుటుంబంలో విషాదం అలుముకుంది. కుటుంబ యజమాని మృతి చెందడంతో అతని భార్య, పిల్లలు అనాథలయ్యారు. భార్య సుభాషిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం



రాజంపేట రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం రెండు పూరిళ్లు దగ్ధం అయ్యాయి. రోజు వారి కూలి పనులు చేసుకొని జీవించే రెండు కుటుంబాలు నిరాశ్రయులుగా వీధిన పడ్డాయి. మండల పరిధి కొల్లావారిపల్లి పంచాయతీలోని దళితవాడలో గార్లపాటి సుశీల పూరిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సమీపంలోని పిల్లిపోగు రాజమ్మ ఇంటికి వ్యాపించాయి. ఈ సంఘటనలో రెండిళ్లు కాలిపోయాయి. సుశీల కుటుంబంలో సుశీలతోపాటు తన భర్త, ఇద్దరు పిల్లలు, రాజమ్మ కుటుంబంలో రాజమ్మతోపాటు తన భర్త, నలుగురు పిల్లలు ఉన్నారు. మంటలు చెలరేగడంతో ఏ వస్తువు వెలుపలికి తెచ్చుకొనే అవకాశం లేకపోవడంతో మొత్తం సామగ్రి అగ్నికి ఆహుతి అయింది. జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి భర్త వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు దాసరి పెంచలయ్య విషయాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డికి తెలిపారు. ఆకేపాటి ఆదేశాల మేరకు తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య, సచివాలయ కన్వీనర్ కత్తి నరసింహా తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి దాదాపు ఒక లక్షా 50 వేల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని వారు కోరారు.